క్లుప్తంగా

పెద్దమ్మకు ప్రత్యేక పూజలు



దొర్నిపాడు: మండలంలోని డబ్ల్యూ గోవిందిన్నె గ్రామంలో వెలసిన మూలపెద్దమ్మకు ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. వేకువజాము నుంచే మహిళలు పుణ్యస్నానాలు ఆచరించి అమ్మవారిని దర్శించుకున్నారు. చీరలు, గాజులు, నిమ్మకాయలు, పిండివంటలు అమ్మవారికి మొక్కుగా చెల్లించారు. ఆలయ కమిటీ సభ్యులు తలారి శ్రీనివాసులు, శంకరయ్య, చిన్నపెద్దన్న, చిన్నన్నలు భక్తులకు తీర్థప్రసాదాలు అందజేసి అన్ని సౌకర్యాలు కల్పించారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం



రాష్ట్ర స్థాయి యోగా పోటీలకు ఎంపికైన వారితో యోగా సంఘం సభ్యులు

ఆళ్లగడ్డ : యోగా సాధనతో సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని యోగా సంఘం చైర్మన్ ఆవుల విజయ భాస్కర్‌రెడ్డి అన్నారు. స్థానిక ఆవుల పుల్లారెడ్డి సేవా సమితి యోగా హాల్‌లో ఆదివారం జిల్లా యోగా పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన వారికి బహుమతులు ప్రదానం చేశారు. సెప్టెంబర్‌లో విశాఖపట్టణంలో జరగనున్న రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొని క్రీడాకారులు మరిన్ని పథకాలు సాధించాలని ఆకాంక్షించారు. పోటీల్లో జిల్లాలోని 300 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. కార్యక్రమంలో సీనియర్ వ్యాయామ ఉపాధ్యాయులు శ్రీధర్, శ్రీనివాసరెడ్డి, వెంకటేశ్వర్లు, ప్రతాప్, దాదాపీర్, నాగేంద్ర, శ్రీలత ఉన్నారు

వైభవంగా శ్రీగౌస్‌పీర్ షా ఖాద్రీ గంధోత్సవం



దర్గాలో గంధం సమర్పిస్తున్న భక్తులు

చాగలమర్రి: స్థానిక చిన్నమకానం వీధిలో వెలసిన హజ్రత్ సయ్యద్ గౌస్‌పీర్ షా ఖాద్రీ వారి గంధోత్సవం ఆదివారం రాత్రి దర్గా పీఠాధిపతి శ్రీసయ్యద్ లాలామియ్యా షా ఖాద్రీ ఆధ్వర్యంలో వైభవంగా జరిగింది. కార్యక్రమానికి కమలాపురం దర్గా పీఠాధిపతి శ్రీసయ్యద్ మౌలానా షా ఖాద్రీ హాజరయ్యారు. ఆయన సమక్షంలో స్వామి వారి గంధాన్ని స్థానిక ఆసారే షరీఫ్ నుంచి చిన్న మకానం, మేయిన్ బజార్ మీదుగా దర్గా వరకు పక్కీర్ల మేళతాళాలల మధ్య ఊరేగింపుగా దర్గా వద్దకు తీసుకొచ్చారు. భక్తులతో కలిసి ప్రత్యేక ఫాతెహాలు నిర్వహించి గంధం సమర్పించారు. భక్తులకు దర్గా తరుపున అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి స్వామి వారి శిష్యులు రామచంద్రుడు, శేఖర్, రజక సోదర సోదరిమణులు, పురప్రముఖులు పాల్గొన్నారు.


సామాజిక సేవలను విస్తరిస్తాం



మినరల్ వాటర్ ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న రాజగోపాల్‌రెడ్డి

నంద్యాల(అర్బన్): సామాజిక సేవలను విస్తరిస్తామని వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు మలికిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి అన్నారు. పేద ప్రజలకు సాయం చేయడం, పట్టణ ప్రజలకు తాగు నీరు అందించడం తదితర సేవా కార్యక్రమాలను కొన్నేళ్లుగా నిర్వహిస్తున్నామన్నారు. నంద్యాల మండలం చాపిరేవుల గ్రామ రహదారిలోనున్న కాశిరెడ్డినాయన నిత్యాన్నదాన సత్రానికి సొంత నిధులతో ఏర్పాటు చేసిన మినరల్ వాటర్ ప్లాంట్ తన తనయుడు గంగా చరణ్‌రెడ్డితో కలిసి ఆదివారం ప్రారంభించారు. నాయకులు శంకర్‌రెడ్డి, మల్లికార్జునరెడ్డి, శివారెడ్డి, జగన్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఉచిత శస్త్ర చికిత్సలు ప్రారంభం



రోగులకు వినికిడి యంత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్‌రెడ్డి

నంద్యాల(వ్యవసాయం): స్థానిక మధుమణి నర్సింగ్ హోంలో ఉచిత శస్త్ర చికిత్సల శిబిరాన్ని ఆదివారం ప్రారంభించారు. ఇందుకు ముఖ్య అతిథిగా శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్‌రెడ్డి హాజరై జ్యోతి ప్రజ్వలన చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ 33 సంవత్సరాల పాటు ఉచిత శస్త్ర చికిత్సల శిబిరం నిర్వహించడం అభినందనీయమన్నారు. వైఎస్సార్ ఆరోగ్యశ్రీ వసతులతో కాంక్లియర్ ఇంప్లాంట్ ఆపరేషన్లు చేయడాన్ని ప్రశంసించారు. ఆసుపత్రి నిర్వాహకులు మధుమణి, మణిదీప్ మాట్లాడుతూ శస్త్రచికిత్స శిబిరాన్ని వారం రోజుల పాటు నిర్వహించి ఉచితంగా రూ.50 లక్షలు విలువజేసే మందులు ఉచితంగా అందజేస్తామని చెప్పారు. అలాగే.. వారం రోజుల పాటు ఓపీ సేవలు, మందులు ఉచితంగా అందజేస్తామన్నారు. వెదుర్ల రామచంద్రారావు, ఎస్ఎండీ ఫిరోజ్, భూమా విఖ్యాత్‌రెడ్డి, మధు ప్రీతి, సింధు పాల్గొన్నారు.



స్ఫటిక లింగేశ్వర ఆలయంలో హోమాలు నిర్వహిస్తున్న భక్తులు



బాబా దర్శనం కోసం బారులు తీరిన భక్తులు,



బొమ్మలసత్రం షిర్డీ సాయిబాబా ఆలయంలో భక్తులకు అన్నదానం చేస్తున్న దృశ్యం,



ఆళ్లగడ్డలో ప్రత్యేకాలంకరణలో షిర్డీ సాయిబాబా

జ్ఞానామృతం పంచే గురుపౌర్ణమి

నంద్యాల(వ్యవసాయం): గురుపౌర్ణమిని పురస్కరించుకొని ఆదివారం పట్టణంలోని పలు దేవాలయాలు, ఆశ్రమాల్లో స్వామివార్లను, గురువులను దర్శించుకొని పూజలు చేపట్టారు. అలాగే పలు పాఠశాలలు, కాలేజీల్లో విద్యార్థులు తమ గురువులకు పూలు, పండ్లు ఇచ్చి శుభాకాంక్షలు చెప్పి పాదాభివందనం చేశారు.

- పట్టణంలోని నాగులకుంట రోడ్డులోని షిర్డీ సాయిబాబా ఆలయంలో సాయిబాబా సేవా సమితి ఆధ్వర్యంలో స్వామివారికి ఉదయమే, పంచామృతాభిషేకాలు, విష్ణుసహస్ర నామార్చన, విశేషాలంకారాలు, పూలంగిసేవ, మధ్యాహ్నం కాకడ హారతి, నిర్వహించి భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. స్వామి వారికి బంగారు సింహాసనం, మకర తోరణాలతో ప్రత్యేకంగా అలంకరించారు. దాదాపుగా 30వేల మంది భక్తులు దర్శించుకున్నారని ఆలయ నిర్వాహకులు నిచ్చెనమెట్ల సుబ్బరామయ్య, కల్లూరు రామలింగారెడ్డి, కందుకూరి శ్రీరామమూర్తి తెలిపారు.
- బొమ్మసత్రంలోని సాయిబాబా దేవాలయంలో ఉదయమే పంచామృతాభిషేకాలు, విష్ణుసమస్ర నామావళి పారాయణం, హోమాలు, నిర్వహించి భక్తులకు అన్నదానం చేశారు. కుందూనది ఒడ్డునున్న జంబులాపరమేశ్వరి ఆలయ సమీపంలో సాయిబాబా దేవాలయంలో ప్రత్యేక పూజలు, హోమాలు, విష్ణుసహస్ర నామాలు, భజనలు నిర్వహించారు. అనంతరం చిన్నారులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.





చాగలమర్రిలో సాయి సత్యవ్రతాన్ని నిర్వహిస్తున్న వేద పండితుడు కైప వేంకటనరసింహశాస్త్రి, ఉయ్యాలవాడ శ్రీ వేణుగోపాల స్వామి ఆశ్రమంలో గీతాపారాయణం చేస్తున్న భక్తులు

- కల్పనా సెంటర్‌లోని కాశిరెడ్డినాయన ఆశ్రమంలో ప్రత్యేక అలంకరణలు నిర్వహించి కాశిరెడ్డినాయన, గంగమ్మ అవ్వలకు విగ్రహాలకు ఉదయమే అభిషేకాలు నిర్వహించి విష్ణుసహస్ర నామావళి పారాయణం నిర్వహించి భక్తులకు అన్నదానం చేపట్టారు. క్రాంతినగర్‌లోని కాశిరెడ్డినాయన ఆశ్రమంలో నిర్వాహకులు ప్రత్యేక పూజలు చేసి కాశినాయనను విశేషంగా అలంకరించారు. హౌసింగ్ బోర్డు కాలనీలోని స్ఫటిక లింగేశ్వర ఆలయంలో గురుపౌర్ణమిని పురస్కరించుకొని హోమాలు జరిపించారు. ఎన్‌జీఓ కాలనీలోని సాయికరణాలయంలో శ్యాంచరణ్ బాబా చిత్రపటానికి అభిషేకం చేసి పూజలు చేశారు. వన్‌టౌన్ ఏరియాలోని కాళికాంబ చంద్రశేఖరస్వామి దేవస్థానంలో స్వామి, అమ్మవార్లకు ఉదయమే పంచామృతాభిషేకాలు చేపట్టి అమ్మవారికి వడిబియ్యం, చీర, సారె సమర్పించి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

గోస్పాడు: వ్యాసమహర్షి పుట్టిన రోజును పురస్కరించుకొని గురుపౌర్ణమిని మండలంలోని గ్రామాల్లో ఆదివారం ఘనంగా నిర్వహించారు. గోస్పాడులో వ్యాస మహర్షి చిత్రపటానికి పూలమాలలు వేసి పూజలు చేశారు. అలాగే గోస్పాడు, యాళ్లూరు, జూలేపల్లె గ్రామాల్లోని షిర్డీసాయిబాబా దేవాలయాల్లో తెల్లవారుజాము నుంచే ప్రత్యేక పూజలు చేపట్టారు.

కిటకిటలాడిన గురు మందిరాలు

ఆళ్లగడ్డ : గురు పౌర్ణమి సందర్భంగా ఆదివారం నియోజవర్గ పరిధిలోని గురు మందిరాలు భక్తులతో కిటకిటలాడాయి. తెల్లవారు జామునుంచే భక్తులు మందిరాలకెళ్లి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అర్చనలు, భజనలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. పట్టణ శివారులోని ఎంవీ నగర్‌లో వెలసిన శ్రీ షిరిడి సాయి మందిరంలో భక్తులు విశేష పూజలు నిర్వహించారు. తెల్లవారు జామున సుప్రబాత సేవతో మొదలైన పూజలు కాకాడ హారతి (వెన్న నైవేద్యం), విశేష పంచామృత అభిషేకం, అర్చనల అనంతరం బెంగళూరు నుంచి ప్రత్యేకంగా తెప్పించిన పూలతో బాబాను, మందిరాన్ని ప్రత్యేకంగా అలంకరించి (పూలంగిసేవ). మంగళ హారతి ఇచ్చారు. సాయంత్రం గురుపూజా కార్యక్రమం వైభవోపేతంగా నిర్వహించారు.

చాగలమర్రి: శ్రీషిర్డీ సాయినాథుని మందిరంలో ఆదివారం గురుపౌర్ణమి వేడుకలు శ్రీఆర్యవైశ్య సభ, శ్రీఅయ్యప్పాస్వామి సేవా సమాజం, శ్రీషిరిడిసాయి సేవా సమాజం సంయుక్తంగా నిర్వహించారు. సాయిబాబా చిత్రపటంతో భిక్షాటన చేస్తూ అమ్మవారి శాల నుంచి భక్తులు పాతబస్టాండు సమీపంలో వెలసిన అయ్యప్ప స్వామి ఆలయంలలో ఉన్న బాబా మందిరానికి చేరుకున్నారు. బాబాకు పంచామృత అభిషేకం, నూతన వస్త్రాధారణ, పుష్పాలంకరణ, గోధుమలు యిసురుట, ధుని హోమపూజ కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం వేద పండితులు కైప వేంకటనరసింహ శాస్త్రి (పెద్దశాస్త్రి) వేద సత్యవ్రత కార్యక్రమం చేపట్టారు. అయ్యప్పా స్వామి సేవా సమాజం అధ్యక్షుడు సుంకు జనార్దనరావు, ప్రధాన కార్యదర్శి ఎం.లక్ష్మీనారాయణ, కార్యదర్శి కె.నాగభూషణం పాల్గొన్నారు.



ఎస్‌కేరోడ్డులో బంగారు సింహాసనంపై భక్తులకు దర్శనమిస్తున్న శ్రీషిర్డీసాయిబాబా

ఉయ్యాలవాడ : మండల కేంద్రంలోని కుందూనది ఒడ్డున వెలిసిన శ్రీ వేణుగోపాల స్వామి ఆశ్రమంలో భక్తులు గీతాపారాయణం చేసి పూజలు నిర్వహించారు. అలాగే పుచ్చకాయలపల్లెలో సాయిబాబా ఆలయంలో భక్తులు పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

దొర్నిపాడు:మండలంలో గురుపౌర్ణమిని ఆదివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉదయం నుంచే సాయిబాబా మందిరాల్లో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం స్వామివార్లను గ్రామోత్సవం నిర్వహించి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

శిరివెళ్ల:మండలంలోని శిరివెళ్ల, వెంకటాపురం, వీరారెడ్డిపల్లె, రాజనగరం ఆలయాలలో ఉదయం నుంచే భక్తులు ఆలయాలకు తరలి వచ్చి బాబాకు ప్రత్యేక పూజలు చేశారు. భజనలు చేశారు. భక్తులకు తీర్థ ప్రసాదాల వితరణ, అన్నదాన కార్యక్రమాలు జరిగాయి. రాత్రిస్వామి వారి గ్రామోత్సవాలు జరిగాయి.

నూతన కార్యవర్గం ఎన్నిక

నంద్యాల(న్యూటౌన్): నంద్యాల జిల్లా హాకీ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎన్నికను ఆదివారం ఎస్పీజీ హైస్కూల్‌లో ఎన్నికల రిటర్నింగ్ అధికారి సయ్యద్ సర్దార్, అడ్వకేట్ డిస్ట్రిక్ట్ స్పోర్ట్స్ అథారిటీ అబ్జర్వర్ లక్ష్మణ్, హాకీ ఆంధ్రప్రదేశ్ అబ్జర్వర్ దాసరి సుధీర్, అనిల్‌కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించారు. 2024-28కి గాను నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. హాకీ నంద్యాల జిల్లా అసోసియేషన్ అధ్యక్షుడిగా వి.పాల్‌రాజరావు, జనరల్ సెక్రటరీగా సునిత్ ముత్యం, ట్రెజరర్‌గా మరియమ్మ, వైస్ ప్రెసిడెంట్‌గా చాణిక్యరాజు, మాణిక్యరాజు, అబ్దుల్‌ఖాదర్, జాయింట్ సెక్రటరీలుగా దివాకర్, స్టీఫెన్, ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా రేచల్, శ్రావణ్‌కుమార్, ఇందిరా చాణిక్య, కెనెడీ, ఓబులేసును సభ్యులుగా ఎన్నుకున్నట్లు తెలిపారు.



ఎన్నికైన హాకీ అసోసియేషన్ నూతన కమిటీ

బ్రాహ్మణ మహా సంఘం జిల్లా అధ్యక్షుడి ఎన్నిక



మాట్లాడుతున్న సునీల్ శర్మ

నంద్యాల(వ్యవసాయం): నంద్యాల జిల్లా అఖిల భారతీయ బ్రాహ్మణ మహా సంఘం జిల్లా అధ్యక్షుడిగా సుధీంద్రాచార్యులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. స్థానిక టెక్కె భరతమాత ఆలయంలో ఆదివారం కర్నూలు జిల్లా దేవెల్ల సాయినాథ్‌వర్మ, సునీల్ శర్మ ఆధ్వర్యంలో పట్టణ అధ్యక్ష, కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. పట్టణ గౌరవాధ్యక్షుడిగా చిట్టిబొట్ల భరద్వాజశర్మ, అధ్యక్షుడిగా మాడుగుల నాగేంద్రశర్మ, సెక్రటరీగా మనోహర్ శర్మ, కార్యదర్శులుగా రామచంద్రమూర్తి, సుదర్శన్, తదితరులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నాయకులు రఘువీర్, రాధాకృష్ణ, పవన్‌శర్మ పాల్గొన్నారు.

అంగన్‌వాడీ అసోసియేషన్ జిల్లా కమిటీ ఎన్నిక

నంద్యాల(న్యూటౌన్): ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ ఏఐటీయూసీ అనుబంధ నూతన కమిటీని ఎన్నుకున్నట్లు సీపీఐ జిల్లా కార్యదర్శి రంగనాయుడు, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి సుంకయ్య ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. నంద్యాల జిల్లా అధ్యక్షులుగా వసుంధరా దేవి, ప్రధాన కార్యదర్శిగా జులేఖ, కోశాధికారిగా ఎస్తేరమ్మతో పాటు 35 మందిని సభ్యులుగా ఎన్నుకున్నారన్నారు.

శానిటేషన్ వర్కర్ల సమస్యలు పరిష్కరించాలి..

నంద్యాల జిల్లా కేంద్రంలోని ప్రభుత్వాసుపత్రిలో పని చేస్తున్న మెడికల్ కాంట్రాక్ట్ శానిటేషన్ వర్కర్ల సమస్యలు పరిష్కరించాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సుంకయ్య కోరారు. ఆదివారం శానిటేషన్ వర్కర్లతో సమావేశమై సమస్యలను అడిగి తెలుసుకున్నారు. శ్రీనివాసులు, ప్రసాద్, తులశమ్మ పాల్గొన్నారు.

యథేచ్ఛగా నిబంధనల ఉల్లంఘన

జూపాడుబంగ్లా: గ్రావెల్, కంకర, ఇసుక తరలించే టిప్పర్లు తప్పనిసరిగా పైన గ్రీన్‌మ్యాట్ లేక టార్పాలిన్ పట్ట కప్పుకొని వెళ్లాలనే హైకోర్టు ఆదేశాలను కొందరు యథేచ్ఛగా ఉల్లంఘిస్తూ రవాణా చేస్తున్నారు. దీంతో వాహనాలు వెళ్లినంత దూరం రోడ్డు వెంట ఇసుక, కంకర, గ్రావెల్ పడ్తున్నాయి. దీంతో వెనకాల వచ్చే ద్విచక్రవాహనాల దారులు స్కిడ్ అయ్యి ప్రమాదాలకు గురవుతున్నారు. అలాగే ప్రయాణికుల కళ్లల్లో ఇసుక, దుమ్ము పడుతుండటంతో రెప్పపాటులో ప్రమాదాలకు గురవుతున్నారు. టార్పాలిన్ కప్పకుండా ఇసుక, గ్రావెల్, కంకరను తరలించే వాహనాలను సీజ్‌చేసి జరిమానా విధించాలని రోడ్డు ట్రాన్స్‌పోర్టు అధికారులకు ఆదేశాలున్నా అమలయ్యేది అంతంతమాత్రమే. దీంతో నిబంధనలు పట్టించుకోకుండా టిప్పర్ డ్రైవర్లు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు.



టార్పాలిన్ లేకుండా కంకర లోడుతో వెళ్తున్న టిప్పర్



కలుసుకున్న పూర్వపు విద్యార్థులు

నవోదయ పూర్వ విద్యార్థుల సమ్మేళనం

నంద్యాల(సిటీ): కర్నూలు జిల్లాలోని జవహర్ నవోదయ బనవాసిలో 1987 – 2023 వరకు చదివిన దాదాపుగా 36 బ్యాచ్‌ల పూర్వ విద్యార్థులు ఆదివారం నంద్యాలలోని ఓ ప్రైవేటు హోటల్‌లో కలుసుకున్నారు. ఆంధ్రప్రదేశ్, ఇతర రాష్ట్రాల్లో స్థిరపడిన వారంతా కొన్ని దశాబ్దాల తర్వాత కుటుంబాలతో వచ్చి ఆత్మీయంగా పలకరించుకున్నారు. నాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకొని సరదాగా గడిపారు.

నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక

ఉయ్యాలవాడ : స్థానిక రెవెన్యూ కార్యాలయంలో సోమవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించనున్నట్లు తహసీల్దార్ వెంకటరమణ ఆదివారం తెలిపారు. మండలంలోని వివిధ గ్రామాల నుంచి వచ్చే ప్రజలు, రైతులు తమ సమస్యలపై అర్జీలు సమర్పిస్తే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు.

26న ఉచిత గుండె వైద్య శిబిరం

శిరివెళ్ల: ఈ నెల 26న మండల కేంద్రంంంలోని శ్రీ వాణి విద్యా నికేతన్‌లో ఉచిత గుండె వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షుడు కండె ఆనంద్ గురూజీ ఆదివారం తెలిపారు. శిబిరంలో రూ. 1300 విలువ గల పరీక్షలు ఉచితంగా చేస్తారన్నారు. టోకన్ నమోదు కోసం 9246963883, 9989983673 నెంబర్లను సంప్రదించాలన్నారు.

అ'పూర్వ' సమ్మేళనం

చాగలమర్రి: స్థానిక ఎస్పీజీ క్రైస్తవ మిషనరీ ఉన్నత పాఠశాలలో 2002-03 విద్యా సంవత్సరంలో 10వ తరగతి విద్యనభ్యసించిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం హెచ్‌ఎం నళిని ప్రియదర్శిని ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి పూర్వ విద్యార్థులు సుమారు 60మంది హాజరయ్యారు. 21 సంవత్సరాల తరువాత తమ స్వగ్రామంలో చదువుకున్న పాఠశాలలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించుకున్నారు. అలనాటి జ్ఞాపకాలను నెమరు వెసుకోని, ఒకరిని ఒకరు ఆత్మీయంగా పలకరించుకున్నారు. ముందుగా మృతి చెందిన పూర్వపు ఉపాధ్యాయులు పెద్దయ్య, అగస్టీన్, సుందరరావు, బోసేలకు సంతాపం వ్యక్తం చేశారు. అనంతరం వేదికపై పూర్వపు ఉపాధ్యాయులు భరత్ భూషణ్, డేవిడ్, లారెన్స్, చంద్రకళా రాణి, మహానందప్ప, సుజీవ్ స్వామిరెడ్డి, దివాకర్, ప్రస్తుత ఉపాధ్యాయులు కరస్పాండెంట్ రెవ.సంజీవ బాబు, హెచ్‌ఎం నళినిలను శాలువాలు, పూల మాలలతో సన్మానించారు.

దివ్యాంగుల చట్టాన్ని అమలు చేయాలి

నంద్యాల(అర్బన్): దివ్యాంగుల చట్టాన్ని పూర్తి స్థాయిలో అమలు చేసి దివ్యాంగుల జీవితాల్లో వెలుగులు నింపాలని డిజేబుల్డ్ రైట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఏపీ వ్యవస్థాపక అధ్యక్షుడు మస్తాన్‌వలి కోరారు. స్థానిక కార్యాలయంలో ఆదివారం అసోసియేషన్ ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఎస్సీ,ఎస్టీ, అట్రాసిటీ చట్టం మాదిరిగానే దివ్యాంగుల కోసం బలమైన చట్టాన్ని తీసుకు రావాలని విజ్ఞప్తి చేశారు. కేంద్ర ప్రభుత్వం వికలాంగుల చట్టాన్ని ఆమోదించి 8ఏళ్లు అవుతున్నా రాష్ట్రాల్లో అమలుకు నోచుకోలేదన్నారు. కూటమి ప్రభుత్వం పూర్తిస్థాయిలో చట్టాన్ని అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు కిరణ్‌కుమార్, ఎల్లయ్య, ఖాదర్‌బాషా, వినోద్ పాల్గొన్నారు.

వేధింపుల కేసు నమోదు

మహానంది: గాజులపల్లె గ్రామానికి చెందిన అత్త మామలతో పాటు బంధువులు వేధిస్తున్నారన్న కోర్టు ఉత్తర్వుల మేరకు నలుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ నాగేంద్రప్రసాద్ ఆదివారం తెలిపారు. ఆయన వివరాల మేరకు.. గాజులపల్లె గ్రామానికి చెందిన ఇందిరాబాయికి వైఎస్సార్ జిల్లా కోడూరు మండలం అట్లూరు గ్రామానికి చెందిన శ్రీకాంత్‌నాయక్‌తో 2023 మే నెలలో వివాహం అయ్యింది. అయితే భర్త శ్రీకాంత్‌నాయక్‌తో పాటు అత్తా, మామ, కుటుంబ సభ్యులు అదనపు కట్నం పేరుతో వేధిస్తుండడంతో కోర్టును ఆశ్రయించారన్నారు. కోర్టు ఉత్తర్వుల మేరకు భర్త, అత్తామామలతో పాటు మరొకరిపై కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.



పంట పొలం కాదు!

నంద్యాల పట్టణ శివారులోని కుందూనది గుర్రపుడెక్కతో నిండిపోయింది. నంద్యాల-కర్నూలు హైవేను అనుకుని ఉన్న కుందూ నది పూడిక పేరుకుపోయి నీటి ప్రవాహం నిలిచిపోవడంతో పాటు కాలుష్య కారకాలు మొత్తం నదిలో నిలిచిపోతున్నాయి. ప్రస్తుతం నదిలో గుర్రపు డెక్క విస్తరించిపోవడంతో పంట పొలంలా దర్శనమిస్తోంది. త్వరలో నదికి శ్రీశైలం జలాశయం నుంచి నీటిని విడుదల చేసే అవకాశముండటంతో నదిని శుభ్రం చేయాలని పలువురు కోరుతున్నారు.

– నంద్యాల(సిటీ)

హుసేన్ మృతిపై విచారణ జరిపించాలి

నంద్యాల(న్యూటౌన్): హుసేన్ అనుమానాస్పద మృతిపై సీబీఐతో విచారణ జరిపించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి రంగనాయుడు, సహాయ కార్యదర్శి బాబాఫక్రుద్దీన్ డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ ముచ్చుమర్రి గ్రామంలో 14 రోజులు గడిచినా చిన్నారి మృతదేహాన్ని వెలుగులోకి తేవడంలో పోలీసు శాఖ ఘోరంగా విఫలమైందని విమర్శించారు. లాకప్ డెత్‌పై న్యాయ విచారణ జరపాలని సీపీఎం జిల్లా కార్యదర్శి రమేష్‌కుమార్, పట్టణకార్యదర్శి పుల్లా నరసింహులు డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక సీపీఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ పోలీసులే హుసేన్ మృతదేహాన్ని తీసుకొని వెళ్లి రాత్రికి రాత్రి పూడ్చిపెట్టడం అనుమానాలకు తావిస్తుందన్నారు. భాస్కర్, శ్రీనివాసులు పాల్గొన్నారు.

షార్ట్ సర్క్యూట్‌తో ఉద్యోగికి గాయాలు

పాణ్యం: ట్రాన్స్‌కోలో పోల్‌టూపోల్ వర్కర్‌గా పని చేస్తున్న శ్రీనివాసులు షార్ట్‌సర్క్యూట్‌కు గురయ్యారు. సిబ్బంది తెలిపిన వివరాల మేరకు..ఆదివారం పిన్నాపురం గ్రామంలో విద్యుత్ సమస్య ఉండటంతో శ్రీనివాసులు స్తంభం ఎక్కారన్నారు. ప్రమాదవశాత్తు షాక్ కొట్టి కిందపడ్డాడు. సిబ్బంది 108 వాహనంలో శాంతిరాం ఆసుపత్రికి తీసుకెళ్లారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం నంద్యాలలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రి తరలిచారు. పరీక్షించిన డాక్టర్లు తలకు తీవ్రగాయం, పొట్ట సమీపంలోని ఎముకలకు గాయాలయ్యాయని చెప్పారు. విషయం తెలుసుకున్న అధికారులు జరిగిన ఘటనపై ఆరా తీస్తున్నారు.



ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న శ్రీనివాసులు

మహానందిలో వైభవంగా శాకంబరి ఉత్సవం



మహానంది: ఆషాడమాసం పౌర్ణమి సందర్భంగా ఆదివారం శాకంబరి ఉత్సవం వైభవంగా జరిగింది. ఈఓ శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో వేదపండితులు రవి శంకర అవధాని, అర్చకులు విశేష పూజలు నిర్వహించారు. నంద్యాలకు చెందిన మార్కెట్ ప్రసాద్ దంపతులు సుమారు వెయ్యి కిలోల కూరగాయలను విరాళంగా అందజేశారు.

శాకంబరి ఉత్సవం నిర్వహిస్తున్న అర్చకులు

ముళ్ల పొదలు తొలగించండి

ఉయ్యాలవాడ : మాయలూరు – ఆళ్లగడ్డ ఆర్‌అండ్‌బీ ప్రధాన రహదారి, భీమునిపాడు – ఆర్.జంబులదిన్నె రహదారిలో.. రోడ్డుకు ఇరువైపులా ముళ్ల పొదలు అలుముకున్నాయి. ఈ రహదారుల్లో వాహనాల రద్దీ అధికంగా ఉంటుంది. ఆర్‌టీసీ బస్సుల్లో ప్రయాణిస్తున్న వారు బస్సు కిటికీలకుండే అద్దాలు వేయకపోతే వారికి కూడా ముళ్ల కంప తగులుతోంది. ఇక ఎదురుగా వస్తున్న వాహనాలు వచ్చే సమయంలో రోడ్డు పక్కకు వెళ్లడానికి వీలు లేకుండా పోతోంది. దీంతో వాహనదారులకు ఇబ్బందులు తప్పడం లేదు. ఆర్‌అండ్‌బీ శాఖ అధికారులు రోడ్డు వెంటనున్న ముళ్ల పొదలను తొలగించి ఇబ్బందులను పరిష్కరించాలని ప్రయాణికులు, వాహనదారులు కోరుతున్నారు.



మాయలూరు, ఆళ్లగడ్డ ఆర్‌అండ్‌బీ రహదారిలో రహదారిపైకి వచ్చిన ముళ్లపొదలు